భారత ప్రభుత్వము
శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ
(శాసన నిర్మాణ విభాగము)

सत्यमेव जयते

# అనుసూచిత కులముల మరియు అనుసూచిత జనజాతుల (అత్యాచార నివారణ) చట్టము, 1989

(1989 లోని 33వ చట్టము)

*[1 జూన్, 1991న ఉన్నట్లుగా]*

# The Scheduled Castes and Scheduled Tribes (Prevention of Atrocities) Act, 1989

**(Act 33 of 1989)**

*[As on 1st June, 1991]*

భారత ప్రభుత్వము తరఫున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముద్రణాలయ కమీషనరుగారిచే ప్రభుత్వ కేంద్ర ముద్రణాలయము, హైదరాబాదునందు ముద్రించి ప్రచురించబడినది.
1991

# అవతారిక

ఈ ముద్రణలో 1 జూన్, 1991న ఉన్నట్లుగా ది షెడ్యూల్డు క్యాస్ట్స్ అండ్ షెడ్యూల్డు ట్రైబ్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) యాక్ట్, 1989 (1989 లో 33వ చట్టము) యొక్క ప్రాధికృత తెలుగు పాఠము కలదు. ఈ పాఠమును 26 ఆగష్టు, 1991 తేదీగల భారత రాజపత్రము, అసాధారణ భాగము XVI అనుభాగము 1, సంఖ్య 6, సంపుటము 6లో 463 నుండి 472 వరకుగల పుటలలో ప్రచురించడమైనది.

ఈ తెలుగు పాఠమును, రాష్ట్రపతి ప్రాధికారము ననుసరించి ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద ప్రచురించడమైనది. అట్లు ప్రచురించినమీదట, ఈ అనువాదము ఆ చట్టమునకు ప్రాధికృత తెలుగు పాఠమైనది.

న్యూఢిల్లీ,
తేదీ: 31 ఆగష్టు, 1991.

వి.యస్. రమాదేవి,
కార్యదర్శి, భారత ప్రభుత్వము.

# PREFACE

This edition of The Scheduled Castes and Scheduled Tribes (Prevention of Atrocities) Act, 1989 (Act 33 of 1989) as on 1st June, 1991 contains the authoritative Text of that Act in Telugu which was published in the Gazette of India, Extraordinary Part XVI, Section 1, No. 6, Vol. 6, dated 26th August, 1991 on pages from 463 to 472.

This Telugu text was published under the authority of the President under clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973, and on such publication it became the authoritative text of that Act in Telugu.

New Delhi,
Dated: 31st August, 1991.

**V.S. RAMA DEVI,**
Secretary to Govt. of India .

# అనుసూచిత కులముల మరియు అనుసూచిత జనజాతుల (అత్యాచార నివారణ) చట్టము, 1989.

## పరిచ్ఛేదక్రమము


పరిచ్ఛేదము — పుట

అధ్యాయము 1.

ప్రారంభిక.

1. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము. .. 1
2. నిర్వచనములు. .. 1

అధ్యాయము 2.

అత్యాచార అపరాధములు.

3. అత్యాచార అపరాధముల కొరకు శిక్ష. .. 2
4. కర్తవ్యములను ఉపేక్షించినందుకు శిక్ష. .. 4
5. తరువాతి దోషస్థాపనకు హెచ్చు శిక్ష. .. 5
6. భారత శిక్షాస్మృతిలోని కొన్ని నిబంధనల వర్తింపు. .. 5
7. కొందరి వ్యక్తుల ఆస్తి సమపహరణకు లోనగుట. .. 5
8. అపరాధములను గురించి పురోభావన. .. 5
9. అధికారములు ఒసగుట. .. 5

అధ్యాయము 3.

బహిష్కరణ.

10. అపరాధము చేయగల వ్యక్తిని తొలగించుట. .. 6
11. వ్యక్తి ప్రాంతమును వదలి వెళ్లనపుడు మరియు వదలి వెళ్లిన పిదప అందు ప్రవేశించినపుడు ప్రక్రియ. .. 6
12. 10వ పరిచ్ఛేదము క్రింది ఉత్తరువుకు గురియైన వ్యక్తుల కొలతలు, ఫోటోలు మున్నగునవి తీసుకొనుట. .. 7
13. 10వ పరిచ్ఛేదము క్రింది ఉత్తరువును పాటించనందుకు శాస్తి. .. 7

అధ్యాయము 4.

ప్రత్యేక న్యాయస్థానములు.

14. ప్రత్యేక న్యాయస్థానము. .. 7
15. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటరు. .. 8

అధ్యాయము 5.

వివిధ విషయములు.

16. సామూహిక జుర్మానా విధించుటకు రాజ్యప్రభుత్వ అధికారము. .. 8
17. శాంతిభద్రతల యంత్రాంగము నివారక చర్య తీసుకొనవలసియుండుట. .. 8
18. ఈ చట్టము క్రింది అపరాధమును చేయు వ్యక్తులకు స్మృతిలోని 438వ పరిచ్ఛేదము వర్తించకుండుట. .. 8
19. ఈ చట్టము క్రింది అపరాధము చేసిన దోషులకు స్మృతిలోని 360వ పరిచ్ఛేదముగాని అపరాధుల పరివీక్షణ చట్టపు నిబంధనలుగాని వర్తించకుండుట. .. 8
20. చట్టము ఇతర శాసనములను అధిగమించుట. .. 9
21. ఈ చట్టమును కట్టుదిట్టముగా అమలగునట్లు చూచుట ప్రభుత్వ కర్తవ్యము. .. 9
22. సద్భావముతో తీసికొనిన చర్యకు రక్షణ. .. 10
23. నియమములు చేయు అధికారము. .. 10

# అనుసూచిత కులముల మరియు అనుసూచిత జనజాతుల (అత్యాచార నివారణ) చట్టము, 1989.

**(1989 లోని 33వ చట్టము)**

(11, సెప్టెంబరు 1989)

అనుసూచిత కులములకు మరియు అనుసూచిత జనజాతులకు చెందిన వారిపట్ల అత్యాచార అపరాధములు జరుపకుండ నివారించుటకును, అట్టి అపరాధముల విచారణకై ప్రత్యేక న్యాయస్థానములను ఏర్పాటు చేయుటకును, అట్టి అపరాధములకు గురియైన వారికి సహాయమును, మరియు పునరావాసమును కల్పించుటకొరకును, అందుకు సంబంధించిన లేక దానికి ఆనుషంగికమైన విషయముల కొరకును అయిన చట్టము.

భారత గణరాజ్యముయొక్క నలుబదియవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయనైనది.

## అధ్యాయము 1.

## ప్రారంభిక.

1. (1) ఈ చట్టమును అనుసూచిత కులముల మరియు అనుసూచిత జనజాతుల (అత్యాచార నివారణ) చట్టము, 1989 అని పేర్కొనవచ్చును. సంగ్రహ నామము, విస్తరణ మరియు ప్రారంభము.

(2) ఇది జమ్ము-కాశ్మీరు రాజ్యము మినహా యావద్భారత దేశమునకు విస్తరించును.

(3) ఇది కేంద్ర ప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీన అమలులోనికి వచ్చును.

2. (1) ఈ చట్టములో సందర్భమునుబట్టి అర్థము వేరుగా ఉన్ననే తప్ప- నిర్వచనములు.

(ఏ) "అత్యాచారము" అనగా 3వ పరిచ్ఛేదము క్రింద శిక్షింపదగిన అపరాధము అని అర్థము;

(బీ) "స్మృతి" అనగా క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973 అని అర్థము; 1974లో 2.

(సీ) "అనుసూచిత కులములు, మరియు అనుసూచిత జనజాతులు" అను పదబంధములు సంవిధానములోని 366వ అనుచ్ఛేదముయొక్క ఖండము (24) మరియు ఖండము (25)ల క్రింద ఆయా పదములకు ఒసగిన అర్థమునే కలిగియుండును;

(డీ) "ప్రత్యేక న్యాయస్థానము" అనగా 14వ పరిచ్ఛేదములో ప్రత్యేక న్యాయస్థానముగా నిర్దిష్టపరచిన సెషను న్యాయస్థానము అని అర్థము;

(ఈ) "ప్రత్యేక పబ్లికు ప్రాసిక్యూటరు" అనగా ప్రత్యేక పబ్లికు ప్రాసిక్యూటరుగా నిర్దిష్టపరచిన పబ్లికు ప్రాసిక్యూటరు లేదా 15వ పరిచ్ఛేదములో పేర్కొనిన అడ్వకేటు అని అర్థము;

(ఎఫ్) ఈ చట్టములో ప్రయోగించియుండి ఇందులో నిర్వచించక, స్మృతిలోగాని భారత శిక్షాస్మృతిలోగాని నిర్వచించిన పదములు, పదబంధములు స్మృతిలో లేదా సందర్భానుసారముగ భారత శిక్షా స్మృతిలో ఆయా పదములకు ఒసగిన అర్థమునే కలిగియుండును. 1860లో 45.

(2) ఈ చట్టములో ఏదేని అనుశాసనమును గూర్చిన లేక అందలి ఏదేని నిబంధనను గూర్చిన ఏ నిర్దేశమునైనను, అట్టి అనుశాసనముగాని అట్టి నిబంధనగాని

అమలులో లేని ప్రాంతమునకు సంబంధించి, ఆ ప్రాంతములో తత్సమానమైన శాసనమేదేని ఉన్నచో, అట్టి శాసనమును గూర్చిన నిర్దేశముగా అన్వయించవలెను.

## అధ్యాయము 2.

## అత్యాచార అపరాధములు.

అత్యాచార అపరాధముల కొరకు శిక్ష.

3. (1) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందని ఏ వ్యక్తి అయినను-

(i) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన వారినెవరినైనను ఏదేని తినగూడని లేక అసహ్యకరమైన పదార్థమును తినుమనిగాని లేక త్రాగుమనిగాని బలవంతపెట్టుచో;

(ii) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన ఎవరేని వ్యక్తి యొక్క ఆవరణలోగాని దాని చుట్టు ప్రక్కలగాని మలమూత్రములను, వ్యర్థ పదార్థమును, జంతు మృతకళేబరములను లేక ఏదేని ఇతర అసహ్యకరమైన పదార్థమును పడవేయుట ద్వారా అతనికి హాని, అవమానము లేక చికాకు కలిగించు ఉద్దేశ్యముతో వ్యవహరించుచో;

(iii) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన ఎవరేని వ్యక్తి శరీరమునుండి బలవంతముగా దుస్తులను తొలగించుచో, లేక అతనిని నగ్నముగా గాని ముఖమునకు లేక శరీరమునకు రంగుపూసిగాని వీధులు మొదలగు వాటిలో నడిపించునో లేక మానవ గౌరవమునకు భంగకరమగునట్టి ఏదేని అటువంటి కార్యమును చేయుచో;

(iv) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన ఎవరేని వ్యక్తియొక్క సొంతభూమిని దేనినైనను లేక అతనికి కేటాయించిన లేక కేటాయించుటకు ఎవరేని సమర్థ ప్రాధికారి అధిసూచించిన భూమిని దేనినైనను అక్రమముగా ఆక్రమించుకొనుచో లేక సాగుచేయుచో, లేక అతనికి కేటాయించిన భూమిని [1]అంతరణ చేయించుకొనుచో,

(v) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన ఎవరేని వ్యక్తిని అతని భూమినుండిగాని ఆవరణలనుండిగాని అక్రమముగా తొలగించుచో లేక ఏదేని భూమి, ఆవరణ లేక నీటిపై అతనికిగల హక్కులను అనుభవించకుండ జోక్యము కలుగజేసుకొనుచో,

(vi) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతులకు చెందిన ఎవరేని వ్యక్తిని "వెట్టిచాకిరి" చేయుమనిగాని, ప్రభుత్వము సార్వజనిక ప్రయోజనముల కొరకు విధించిన ఏదేని [2]నిర్బంధసేవ కానట్టి వెట్టిచాకిరీవంటి ఇతర విధమైన బలవంతపు లేక కట్టుబాటు చాకిరి చేయుమనిగాని బలవంతపెట్టుచో లేక ఆశచూపుచో,

(vii) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన ఎవరేని వ్యక్తిని వోటు వేయకూడదనిగాని ఫలానా అభ్యర్థికి వోటు వేయుమనిగాని శాసనము ద్వారా నిబంధించిన రీతిలో కాకుండ ఇతర విధముగా వోటు చేయుమని బలవంతపెట్టుచో లేక జడిపించుచో;

(viii) అనుసూచిత కులమునకు లేక జనజాతికి చెందిన ఎవరేని వ్యక్తిపై తప్పుడు, విద్వేషపూర్వకమైన లేక వేసరించుటకైన దావానుగాని క్రిమినలు లేక ఇతర శాసనబద్ధ చర్యలనుగాని ప్రారంభించుచో;

---

1. బదిలీ. 2. తప్పనిసరి పని.

(ix) ఎవరేని [1]పబ్లికు సేవకునకు ఏదేని తప్పుడు లేక నిస్సారమైన సమాచారమునిచ్చి, తద్వారా అట్టి పబ్లికు సేవకుడు తన శాసనసమ్మత అధికారమును అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికిచెందిన ఎవరేని వ్యక్తికి హాని లేక చికాకుకలుగు రీతిగా ఉపయోగించునట్లు చేయుచో;

(x) ఏదేని స్థలములో జనుల సమక్షములో అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికిచెందిన ఎవరేని వ్యక్తికి తలవంపు కలిగించు ఉద్దేశముతో బుద్ధి పూర్వకముగా అతనిని అవమానపరచుచో లేక జడిపించుచో;

(xi) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికిచెందిన ఏ స్త్రీనైనను అగౌరవపరచు లేక ఆమెకు లజ్జాభంగము కలిగించు ఉద్దేశముతో ఆమెపై దౌర్జన్యము చేయుచో లేక బలప్రయోగము చేయుచో;

(xii) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన ఎవరేని స్త్రీ ఇష్టాఇష్టములపై ప్రాబల్యము చూపగల స్థితిలో ఉండి, అన్యథా ఆమె అంగీక రించియుండియుండని లైంగిక శోషణకు ఆమెను గురిచేయుటకు, అట్టి స్థితిని ఉపయోగించుచో;

(xiii) అనుసూచిత కులములకు లేక అనుసూచిత జనజాతులకు చెందిన వ్యక్తులు మామూలుగా ఉపయోగించెడి ఏదేని నీటి ఊటను, జలాశయమును లేక ఏదేని ఇతర నీటి వనరును మామూలుగా ఉపయోగించెడి ప్రయోజనమునకు అంతగా పనికి రాకుండపోవునట్లు దానిని మురికిచేయుచో లేదా కలుషితముచేయుచో;

(xiv) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన ఎవరేని వ్యక్తికి, ఏదేని సార్వజనిక [2]సమాగమ స్థలమునకు ఆచారగతమైన దారి హక్కు లేదనుచో లేదా ఇతరులందరుగాని వారిలోని ఏదేని వర్గము వారుగాని ఉపయోగించు కొనుటకు లేక అచ్చటికి చేరుటకు హక్కు కలిగియున్న, సార్వజనిక [2]సమాగమ స్థల మును ఉపయోగించుకొనకుండా లేక అచటికి చేరకుండ అట్టి వ్యక్తిని ఆటంకపరచుచో;

(xv) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన ఎవరేని వ్యక్తిని, అతని ఇంటిని, గ్రామమును లేక ఇతర నివాస స్థలమును వదలి వెళ్లి పొమ్మని బలవంతపెట్టుచో లేక వదలి వెళ్లిపోవునట్లు చేయుచో;

అతడు ఆరు మాసముల కంటె తక్కువకాకుండ అయితే అయిదు సంవత్సరముల దాక ఉండగల కాలావధికి కారావాసముతోను, జుర్మానాతోను శిక్షింపదగియుండును.

(2) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందని ఏ వ్యక్తి అయినను–

(i) తత్సమయమున అమలునందున్న శాసనమునుబట్టి మరణదండన విధింప దగిన అపరాధమునకై అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన ఎవరేని వ్యక్తిపై తప్పుడు సాక్ష్యమునిచ్చుట ద్వారాగాని కల్పించుట ద్వారాగాని దోషస్థాపన జరుగునట్లు చేయవలెనను ఉద్దేశముతో లేక తద్వారా అట్లు జరుగగలదని తెలిసియుండి తప్పుడు సాక్ష్యమునిచ్చుచో లేక కల్పించుచో అతడు యావజ్జీవ కారావాసముతోను, జుర్మానాతోను శిక్షింపదగును; అట్టి తప్పుడు లేక కల్పిత సాక్ష్యమునిచ్చిన పరిణామముగా అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన ఎవరేని నిర్దోషిపై దోషస్థాపన జరిగి అతడు మరణదండనను అనుభవించినచో అట్టి తప్పుడు లేక కల్పిత సాక్ష్యమునిచ్చిన వ్యక్తి మరణదండనతో శిక్షింపదగును;

---

1. ప్రజాసేవకుడు. 2. పబ్లిక్ రిజార్టు.

(ii) మరణదండన విధింపదగినదికానిదైననుఏడు సంవత్సరములు లేక అంత కంటె ఎక్కువ కాలావధికి కారావాసముతో శిక్షింపదగిన అపరాధమునకై అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన ఎవరేని వ్యక్తిపై తప్పుడు సాక్ష్యము నిచ్చుట ద్వారాగాని లేక కల్పించుట ద్వారాగాని దోషస్థాపన జరుగవలెనను ఉద్దేశముతో లేక తద్వారా అట్లు జరుగగలదని తెలిసియుండి తప్పుడు సాక్ష్యమునిచ్చుచో లేక కల్పించుచో అతడు ఆరు మాసముల కంటె తక్కువ కాకుండ అయితే ఏడు సంవత్సరములు లేక అంత కంటె ఎక్కువ కాలావధి దాకా వుండగల కారావాసముతోను, జుర్మానాతోను శిక్షింపదగియుండును;

(iii) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన వ్యక్తి యొక్క ఏదేని ఆస్తికి చెరుపు కలిగించు ఉద్దేశముతో లేక అట్లు చెరుపు కలుగగలదని తెలిసియుండి అగ్నిద్వారా గాని, ఏదేని విస్ఫోటకపదార్థము ద్వారాగాని దుశ్చేష్టకు పాల్పడుచో అతడు ఆరు మాసముల కంటె తక్కువ కాకుండ అయితే ఏడు సంవత్సరముల దాకా వుండగల కాలావధికి కారావాసముతోను, జుర్మానాతోను శిక్షింపదగియుండును;

(iv) అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన వ్యక్తి మామూలుగా ఆరాధనస్థలముగా లేక మానవనివాస స్థలముగా లేక ఆస్తిని అభిరక్ష యందుంచుస్థలముగా ఉపయోగించెడి ఏదేని భవనమును నాశముచేయు ఉద్దేశముతో లేక తానుచేయు దుశ్చేష్ట మూలముగా నాశముకాగలదని తెలిసియుండి అగ్నితోగాని ఏదేని విస్ఫోటకపదార్థముతోగాని దుశ్చేష్టకు పాల్పడుచో అతడు యావజ్జీవ కారావాసముతోను, జుర్మానాతోను శిక్షింపదగియుండును;

1860లోని 45. (v) ఎవరేని వ్యక్తికి లేక ఆస్తికి విరుద్ధముగా భారత శిక్షాస్మృతి క్రింద పది సంవత్సరములు లేక అంత కంటె ఎక్కువ కాలావధికి కారావాసముతో శిక్షింపదగు ఏదేని అపరాధమును, అట్టి వ్యక్తి అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన వ్యక్తి అను కారణముగా లేక అట్టి ఆస్తి అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందిన వ్యక్తిదను కారణముగా చేయుచో అతడు యావజ్జీవ కారావాసముతోను, జుర్మానాతోను శిక్షింపదగియుండును;

(vi) ఈ అధ్యాయము క్రింద అపరాధము జరిగినదని తెలిసియుండియు లేక అట్లు విశ్వసించుటకు కారణముండియు అపరాధికి శాసనసమ్మతమైన శిక్షపడకుండ కాపాడు ఉద్దేశముతో, ఆ అపరాధము జరుగుటను గూర్చిన సాక్ష్యమును దేనినైనను మాయముచేయుచో లేక ఆ ఉద్దేశముతో ఆ అపరాధమునకు సంబంధించి తప్పుడుదని తనకు తెలిసినట్టి లేక తప్పుడుదని తాను విశ్వసించునట్టి ఏదేని సమాచారమును అందజేయుచో అతడు ఆ అపరాధమునకై నిబంధించిన శిక్షతో శిక్షింపదగియుండును; లేక

(vii) *పబ్లికుసేవకుడైయుండి ఈ పరిచ్ఛేదము క్రింది ఏదేని అపరాధమును చేయుచో అతడు ఒక సంవత్సరము కంటె తక్కువ కాకుండ, అయితే ఆ అపరాధమునకై నిబంధించిన శిక్షమేరకు వుండగల కాలావధికి కారావాసముతో శిక్షింపదగియుండును.

కర్తవ్యములను ఉపేక్షించి నందుకు శిక్ష. 4. అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతికి చెందని వ్యక్తి *పబ్లికు సేవకుడైయుండి ఈ చట్టము క్రింద తాను నిర్వర్తించవలసిన కర్తవ్యములను బుద్ధిపూర్వకముగా ఉపేక్షించుచో అతడు ఆరుమాసముల కంటె తక్కువ కాకుండ అయితే ఒక సంవత్సరము దాకా వుండగల కాలావధికి కారావాసముతో శిక్షింపదగియుండును.

---

*ప్రజాసేవకుడు.

5. ఏ వ్యక్తిపట్లనైనను ఈ అధ్యాయము క్రింద ఏదేని అపరాధమునకై ఇది వరకే దోషస్థాపన జరిగియుండి రెండవ అపరాధమునకుగాని ఆ తరువాతి ఏదేని అపరాధమునకుగాని మరల దోషస్థాపన జరుగుచో అతడు ఒక సంవత్సరము కంటె తక్కువ కాకుండ అయితే, ఆ అపరాధమునకై విబంధించిన శిక్షమేరకు వుండగల కాలావధికి కారావాసముతో శిక్షింపదగియుండును. తరువాతి దోషస్థాపనకు హెచ్చు శిక్ష.

6. భారత శిక్షాస్మృతిలోని 34వ పరిచ్ఛేదము, అధ్యాయము 3, అధ్యాయము 4, అధ్యాయము 5, అధ్యాము 5ఏ, 149వ పరిచ్ఛేదము మరియు అధ్యాయము 23 యొక్క నిబంధనలు భారత శిక్షాస్మృతి ప్రయోజనముల కొరకు వర్తించునట్లుగనే, ఈ చట్టమునందలి ఇతర నిబంధనలకు లోబడి, ఈ చట్ట ప్రయోజనముల కొరకు వర్తించును. భారత శిక్షా స్మృతిలోని కొన్ని నిబంధనల వర్తింపు.

7. (1) ఎవరేని వ్యక్తి ఈ అధ్యాయము క్రింద శిక్షింపదగు ఏదేని అపరాధమునకు దోషస్థాపన జరిగి, ప్రత్యేక న్యాయస్థానము ఏదేని శిక్ష విధించుటకు అదనముగా, ఆ వ్యక్తికి చెందినదియు ఆ అపరాధము చేయుటకు ఉపయోగించినదియు అయినట్టి ఏదేని స్థిరాస్తి లేక చరాస్తి లేక రెండూను ప్రభుత్వపరమైపోవునని వ్రాతమూలకమైన ఉత్తరువు ద్వారా ప్రఖ్యానించవచ్చును. కొందరి వ్యక్తుల ఆస్తి సమపహరణకు లోనగుట.

(2) ఎవరేని వ్యక్తి ఈ అధ్యాయము క్రింది ఏదేని అపరాధమునకై నిందితుడైనయెడల అతనికి చెందిన అన్ని లేక ఏవేని స్థిరాస్తులను లేక చరాస్తులను లేక రెండింటిని, అట్టి విచారణ కాలావధిలో జప్తుచేయవలెనని, అతనిపై విచారణ జరుపుచున్న ప్రత్యేక న్యాయస్థానము ఉత్తరువు చేయవచ్చును; అట్టి విచారణలో దోషస్థాపన జరిగిన యెడల ఈ అధ్యాయము క్రింద విధించిన ఏదేని జుర్మానాను రాబట్టుటకై కావలసినంత మేరకు, అట్లు జప్తుచేసిన ఆస్తి సమపహరణకు లోనగును.

8. ఈ అధ్యాయము క్రింది అపరాధముకొరకైన అభియోగములో— అపరాధములను గురించి పురోభావన.

(ఏ) నిందితుడు, ఈ అధ్యాయము క్రింది అపరాధమునకు నిందమోపబడిన వ్యక్తికిగాని అట్టి అపరాధము చేసినట్లు సహేతుకముగా అనుమానించబడిన వ్యక్తికిగాని ఏదేని ఆర్థిక సహాయముచేసినాడని రుజువైనచో ప్రత్యేక న్యాయస్థానము, తద్విరుద్ధముగా రుజువుపరచబడిననే తప్ప, అట్టి వ్యక్తి ఆ అపరాధ దుష్ప్రేరణచేసినట్లు పురోభావన చేయవలెను;

(బీ) కొందరు వ్యక్తులు సాముదాయికముగా ఈ అధ్యాయము క్రింది అపరాధముచేసినట్లు రుజువైనచో మరియు ఆ అపరాధము భూమిని లేక ఏదేని ఇతర విషయమును గురించి వున్న ఏదేని వివాదముయొక్క పర్యవసానముగా జరిగినదని రుజువైనచో, ఆ అపరాధము ఉమ్మడి ఉద్దేశసాధనకై లేక ఉమ్మడి లక్ష్య సాధనకై జరిగినదని పురోభావన చేయవలెను.

9. (1) స్మృతిలోగాని ఈ చట్టమునందలి ఏదేని ఇతర నిబంధనలోగాని ఏమి యున్నప్పటికిని రాజ్యప్రభుత్వము, ఏదేని జిల్లాలో లేక అందలి ఏదేని భాగములో— అధికారములు ఒసగుట.

(ఏ) ఈ చట్టము క్రింద ఏదేని అపరాధమును నివారించుటకును లేక దాని విషయములో వ్యవహరించుటకును, లేక

(బీ) ఈ చట్టము క్రింది ఏదేని కేసు కొరకును లేక ఏదేని రకపు లేక వర్గపు కేసుల కొరకును,

తాము ఆవశ్యకమని లేక ఉపయుక్తమని భావించినచో అట్టి జిల్లాలో లేక అందలి భాగములో లేక సందర్భానుసారముగా అట్టి కేసుకొరకు లేక అట్టి రకపు లేక వర్గపు కేసుల కొరకు స్మృతి క్రింద ఒక పోలీసు అధికారి వినియోగించదగిన అధికారములను,

ప్రత్యేకించి వ్యక్తులను అరెస్టుచేయు, దర్యాప్తు జరుపు మరియు ఏదేని ప్రత్యేక న్యాయస్థానము సమక్షమున అభియోగమును తెచ్చు అధికారములను రాజపత్రములో అధిసూచన ద్వారా ఎవరేని రాజ్యప్రభుత్వాధికారికి ఒసగవచ్చును.

(2) ఈ చట్టముయొక్క లేక ఈ చట్టము క్రింద చేసిన ఏదేని నియమము, పథకము లేక ఉత్తరువుయొక్క నిబంధనలను అమలుపరచుటలో ఉపపరిచ్ఛేదము-(1)లో నిర్దేశించిన అధికారికి పోలీసు అధికారులందరును, ఇతర ప్రభుత్వాధికారులందరును తోడ్పడవలెను.

(3) సమ్మతియొక్క నిబంధనలు, వీలైనంతమేరకు, ఎవరేని అధికారి ఉప పరిచ్ఛేదము (1) క్రింది అధికారములను వినియోగించుటకు వర్తించును.

## అధ్యాయము 3.

## బహిష్కరణ.

అపరాధము చేయగల వ్యక్తిని తొలగించుట.

10. (1) సంవిధానముయొక్క 244వ అనుచ్ఛేదములో నిర్దేశించిన "అనుసూచిత ప్రాంతముల" లేక "జనజాతి ప్రాంతముల"లో చేర్చిన ఏదేని ప్రాంతములో ఎవరేని వ్యక్తి, ఈ చట్టములోని 2వ అధ్యాయము క్రింద ఏదేని అపరాధమును బహుశః చేయగలడని ప్రత్యేక న్యాయస్థానమునకు, ఫిర్యాదు లేక పోలీసు రిపోర్టు అందిన మీదట, రూఢియైనయెడల, ఆ న్యాయస్థానము వ్రాతమూలకమైన ఉత్తరువు ద్వారా, అట్టి ఉత్తరువులో నిర్దిష్టపరచినట్టి మార్గమునను అట్టి గడువు లోపలను అట్టి ప్రాంతపు హద్దులు దాటి వెళ్ళిపోవలెననియు, అతడు ఏ ప్రాంతమును వదలి వెళ్ళి పోవుటకు ఆదేశించన్నైనదో ఆ ప్రాంతమునకు ఆ ఉత్తరువులో నిర్దిష్టపరచినట్లు రెండు సంవత్సరములకు మించని కాలావధిపాటు తిరిగి రాకూడదనియు అట్టి వ్యక్తిని ఆదేశించవచ్చును.

(2) ప్రత్యేక న్యాయస్థానము ఉపపరిచ్ఛేదము (1) క్రింది ఉత్తరువుతోపాటు అట్టి ఉత్తరువు చేయుటకుగల కారణములను ఆ ఉపపరిచ్ఛేదము క్రింద ఆదేశించిన వ్యక్తికి తెలియజేయవలెను.

(3) ఉపపరిచ్ఛేదము (1) క్రింద చేసిన ఉత్తరువు తేదీ నుండి ముప్పది దినములలోపల, అట్టి ఉత్తరువుకు గురియైన వ్యక్తిగాని అతని తరఫున ఎవరేని ఇతర వ్యక్తిగాని విన్నపము చేసికొనిన మీదట ప్రత్యేక న్యాయస్థానము వ్రాసియుంచవలసిన కారణములనుబట్టి, అట్టి ఉత్తరువును ప్రతిసంహరించ వచ్చును లేక మార్పు చేయవచ్చును.

వ్యక్తి ప్రాంతమును వదలి వెళ్లనపుడు మరియు వదలి వెళ్ళిన పిదప అందు ప్రవేశించినపుడు ప్రక్రియ.

11. (1) ఏదేని ప్రాంతమును వదలివెళ్ళి పోవలసినదిగా 10వ పరిచ్ఛేదము క్రింద ఆదేశము జారీయైన వ్యక్తి-

(ఏ) ఆదేశించినట్లుగా వెళ్ళిపోనిచో; లేక

(బీ) అట్లు వెళ్ళిపోయి, ఉపపరిచ్ఛేదము (2) క్రింద ప్రత్యేక న్యాయ స్థానము వ్రాతమూలకముగా ఇచ్చిన అనుజ్ఞతో తప్ప ఆ ఉత్తరువులో నిర్దిష్టపరచినట్టి కాలావధిలోపల అట్టి ప్రాంతములో ప్రవేశించుచో,

ప్రత్యేక న్యాయస్థానము అతనిని అరెస్టుచేయించి, ఆ న్యాయస్థానము నిర్దిష్టపరచునట్టి ప్రాంతము వెలుపలి స్థలమునకు, పోలీసు అభిరక్షలో, తొలగింప జేయవచ్చును.

(2) 10వ పరిచ్ఛేదము క్రింది ఉత్తరువుకు గురియైన ఏ వ్యక్తినైనను ప్రత్యేక న్యాయస్థానము వ్రాతమూలకమైన ఉత్తరువు ద్వారా, ఏ ప్రాంతము నుండి

అతడు వెళ్లి పోవలెనని ఆదేశించన్నైనదో ఆ ప్రాంతమునకు, అట్టి ఉత్తరువులో నిర్దిష్ట పరచినట్టి తాత్కాలికమ్మైన కాలావధిపాటు మరియు అట్టి షరతులకులోబడి తిరిగి వచ్చుటకు అనుజ్ఞ నొసగవచ్చును; విధించిన షరతులను తగురీతిగా పాటించుటకు జామీనుతోగాని జామీను లేకుండాగాని బాండు వ్రాసి ఈయవలసినదిగా అతనిని కోరవచ్చును.

(3) ప్రత్యేక న్యాయస్థానము ఎప్పుడ్నైనను అట్టి ఏదేని అనుజ్ఞను ప్రతిసంహరించవచ్చును.

(4) ఏ వ్యక్తియ్యైనను, తాను ఏ ప్రాంతము నుండి వెళ్లి పోవలెనని ఆదేశించన్నైనదో ఆ ప్రాంతమునకు అట్టి అనుజ్ఞతో వచ్చినపుడు విధించిన షరతులను అతడు పాటించవలెను; తిరిగి వచ్చుటకు అనుమతించిన తాత్కాలిక కాలావధి ముగియగనే లేక అట్టి తాత్కాలిక కాలావధి ముగియుటకు పూర్వము అట్టి అనుజ్ఞను ప్రతిసంహరించిన మీదట అట్టి ప్రాంతము వెలుపలికి వెళ్లి పోవలెనను మరియు క్రొత్తగా అనుజ్ఞ లేకుండా 10వ పరిచ్ఛేదము క్రింద నిర్దిష్టపరచిన కాలావధిలో మిగిలియున్న కాలము లోపల ఆ ప్రాంతమునకు తిరిగి రాకూడదు.

(5) విధించిన ఏవేని షరతులను ఎవరేని వ్యక్తి పాటించనిచో లేక ఆ ప్రకారము వెళ్లిపోనిచో లేక అట్లు వెళ్లిపోయి క్రొత్తగా అనుజ్ఞ లేకుండా అట్టి ప్రాంతములో ప్రవేశించుచో లేక అచటికి తిరిగి వచ్చుచో ప్రత్యేక న్యాయస్థానము అతనిని అరెస్టు చేయించి, ఆ న్యాయస్థానము నిర్దిష్టపరచునట్టి ప్రాంతము వెలుపలి స్థానమునకు పోలీసు అభిరక్షలో తొలగింపజేయవచ్చును.

12. (1) 10వ పరిచ్ఛేదము క్రింద చేసిన ఉత్తరువుకు గురియ్యైన వ్యక్తి యొక్క కొలతలను, ఫోటోలను తీసుకొనవలెనని ప్రత్యేక న్యాయస్థానము కోరినచో, అట్టి ప్రతి వ్యక్తి పోలీసు అధికారిని అట్లు తీసుకొననీయవలెను. *10వ పరిచ్ఛేదము క్రింది ఉత్తరువుకు గురియ్యైన వ్యక్తుల కొలతలు, ఫోటోలు మున్నగునవి తీసుకొనుట.*

(2) ఉపపరిచ్ఛేదము (1)లో నిర్దేశించిన ఎవరేని వ్యక్తిన్ని అతని కొలతలను లేక ఫోటోలను తీసుకొననీయవలెనని కోరినపుడు అట్టి కొలతలు లేక ఫోటోలు తీసుకొనకుండ ప్రతిఘటించుచో లేక తీసుకొననీయనిచో, వాటిని తీసుకొనుటకు ఆవశ్యకమ్మైన పద్ధతులన్నింటిని ఉపయోగించుట శాసనసమ్మతమ్మైయుండును.

(3) కొలతలు లేక ఫోటోలు తీసుకొనకుండ ఉపపరిచ్ఛేదము (2) క్రింద ప్రతిఘటించుటను లేక వాటిని తీసుకొననీయకుండుటను భారత శిక్షాస్మృతి 186వ పరిచ్ఛేదము క్రింద అపరాధముగా భావించవలెను. *1860లో 45.*

(4) 10వ పరిచ్ఛేదము క్రింది ఉత్తరువును ప్రతిసంహరించినయెడల ఉపపరిచ్ఛేదము (2) క్రింద తీసుకొనిన అన్ని కొలతలను, ఫోటోలను (నెగటివ్‌లతో సహా) నాశముచేయవలెను లేక అట్టి ఉత్తరువుకు గురియ్యైన వ్యక్తికి ఇచ్చివేయవలెను.

13. 10వ పరిచ్ఛేదము క్రింద ప్రత్యేక న్యాయస్థానము చేసిన ఉత్తరువును ఉల్లంఘించు ఏ వ్యక్తి అయినను ఒక సంవత్సరము దాకా వుండగల కాలావధికి కారావాసముతోను, జుర్మానాతోను శిక్షింపదగియుండును. *10వ పరిచ్ఛేదము క్రింది ఉత్తరువును పాటించనందుకు శాస్తి.*

## అధ్యాయము 4.

## ప్రత్యేక న్యాయస్థానములు.

14. విచారణ శీఘ్రముగా జరుగు ఏర్పాటుచేయుటకుగాను రాజ్యప్రభుత్వము, ఉన్నత న్యాయస్థానపు ముఖ్య న్యాయమూర్తి సమ్మతితో, రాజపత్రములో అధిసూచన ద్వారా, ఒక్కొక్క జిల్లాకు ఒక సెషను న్యాయస్థానమును ఈ చట్టము క్రింది అపరాధముల విచారణక్కై ఒక ప్రత్యేక న్యాయస్థానముగా నిర్దిష్టపరచవలెను. *ప్రత్యేక న్యాయస్థానము.*

ప్రత్యేక పబ్లిక్కు ప్రాసిక్యూటరు.

15. ప్రతియొక ప్రత్యేక న్యాయస్థానముకు రాజ్యప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా ఆ న్యాయస్థానములోని కేసులను నడుపుట కొరకు ప్రత్యేక పబ్లిక్కు ప్రాసిక్యూటరుగా ఒక పబ్లిక్కు ప్రాసిక్యూటరును నిర్దిష్టపరచవలెను, లేదా ఏడు సంవత్సరముల కంటె తక్కువ కాని కాలముపాటు అడ్వకేటు వృత్తిలో ఉండిన ఒక అడ్వకేటును నియమించవలెను.

## అధ్యాయము 5.

### వివిధ విషయములు.

సామూహిక జుర్మానా విధించుటకు రాజ్యప్రభుత్వ అధికారము. 1955లో 22.

16. ఈ చట్టము క్రింద సామూహిక జుర్మానా విధించి, దానిని వసూలు చేయుట కొరకును, అందుకు సంబంధించిన ఇతర విషయముల కొరకును సివిలు హక్కుల రక్షణ చట్టము, 1955 యొక్క పరిచ్ఛేదము 10ఎ నిబంధనలు వీలైనంత మేరకు వర్తించును.

శాంతిభద్రతల యంత్రాంగము నివారక చర్య తీసుకొనవలసి యుండుట.

17. (1) జిల్లా మేజిస్ట్రేటుగాని సబ్ డివిజనలు మేజిస్ట్రేటుగాని ఎవరేని ఇతర కార్యపాలక మేజిస్ట్రేటుగాని, పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటు కంటె తక్కువకాని హోదాగల ఎవరేని పోలీసు అధికారిగాని, తన అధికారితాపరిధి స్థానిక హద్దులలోపల ఏ స్థలమునందైనను నివసించుచున్న లేక ఆ స్థలమునకు తరచుగా వచ్చుచుండెడి, అనుసూచిత కులమునకు లేక అనుసూచిత జనజాతులకు చెందని ఎవరేని వ్యక్తిగాని, వ్యక్తుల సముదాయముగాని ఈ చట్టము క్రింది ఏదేని అపరాధమును బహుశః చేయుదునని బెదరించినాడని లేక చేయుదునని బెదరించినారని సమాచారము అందిన మీదట, తాను ఆవశ్యకమని భావించునట్టి పరిశీలన జరిపిన పిమ్మట అట్లు విశ్వసించుటకు కారణమున్నచో మరియు చర్య తీసుకొనుటకు చాలినంత ఆధారమున్నదని అభిప్రాయపడినచో అతడు అట్టి ప్రాంతమును అత్యాచారములు జరుగు అవకాశముగల ప్రాంతముగా ప్రఖ్యానించి, శాంతియుతముగాను సత్ప్రవర్తనతోను మెలగునట్లు చూచుటకును ప్రజా శాంతిభద్రతలను, ప్రశాంతతను కాపాడుటకును ఆవశ్యకమైన చర్యను తీసుకొనవచ్చును; నివారక చర్యను కూడ తీసుకొనవచ్చును.

(2) ఉపపరిచ్ఛేదము (1) యొక్క ప్రయోజనముల కొరకు స్మృతిలోని అధ్యాయములు 8, 10 మరియు 11లలోని నిబంధనలు వీలైనంతమేరకు వర్తించును.

(3) అనుసూచిత కులముల మరియు అనుసూచిత జనజాతులకు చెందిన వారి పట్ల జరుగు అత్యాచారములను నివారించుటకును, వారిలో భద్రతా భావమును తిరిగి నెలకొల్పుటకును తీసికొనవలసిన సముచితమైన చర్యను నిర్దిష్టపరచుచు రాజ్య ప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా ఒకటి లేక అంతకంటె ఎక్కువ పథకములను రూపొందించి ఉపపరిచ్ఛేదము (1)లో నిర్దిష్టపరచిన అధికారులు అట్టి చర్యను ఏ రీతిగా తీసికొనవలెనో అందు నిర్దిష్టపరచవచ్చును.

ఈ చట్టము క్రింది అపరాధమును చేయు వ్యక్తులకు స్మృతిలోని 438వ పరిచ్ఛేదము వర్తించకుండుట.

18. ఈ చట్టము క్రింది అపరాధము చేసినట్లు నిందమోపన్నైన ఎవరేని వ్యక్తిని అరెస్టు చేయవలసియుండు ఏదేవి కేసు విషయములో స్మృతిలోని 438వ పరిచ్ఛేదములో నున్నదేదియు వర్తించదు.

ఈ చట్టము క్రింది అపరాధముచేసిన దోషులకు స్మృతిలోని 360వ పరిచ్ఛేదముగాని అపరాధుల పరివీక్షణ చట్టపు నిబంధనలుగాని వర్తించకుండుట.

19. ఈ చట్టము క్రింది అపరాధము చేసినందుకు దోషియైయుండి పదునెనిమిది సంవత్సరముల వయసు దాటిన ఏ వ్యక్తికైనను స్మృతిలోని 360వ పరిచ్ఛేదపు నిబంధనలు మరియు అపరాధుల పరివీక్షణ చట్టము, 1958 యొక్క నిబంధనలు వర్తించవు.

**చట్టము ఇతర శాసనములను అధిగమించుట.**

20. ఈ చట్టములో ఇతర విధముగా నిబంధించియున్నట్లు తప్ప ఈ చట్టపు నిబంధనలు, తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనములోగాని ఏదేని అట్టి శాసనమునకనుసరించి అమలుకలిగియున్న ఏదేని ఆచారము లేక వాడుక లేక ఏదేని పత్రములో గాని దానికి అననుగుణముగా . ఏమియున్నప్పటికిని, అమలు కలిగి యుండును.

**ఈ చట్టమును కట్టుదిట్టముగా అమలగునట్లు చూచుట ప్రభుత్వ కర్తవ్యము.**

21. (1) కేంద్ర ప్రభుత్వము ఈ విషయమున చేయు నియమములకు లోబడి రాజ్య ప్రభుత్వము ఈ చట్టమును కట్టుదిట్టముగ అమలు జరుపుటకు ఆవశ్యకమగునట్టి చర్యలను తీసుకొనవలెను.

(2) ప్రత్యేకించియు, పై నిబంధనల వ్యాపకతకు భంగము కలుగకుండా అట్టి చర్యలలో ఈ క్రిందివి చేరియుండవచ్చును:-

(i) అత్యాచారములకు గురియైన వ్యక్తులు న్యాయము పొందుటకు వీలుగా వారికి న్యాయ సహాయముతో సహా తగు సౌకర్యములను ఏర్పాటు చేయుట;

(ii) ఈ చట్టము క్రింది అపరాధముల దర్యాప్తు, విచారణ జరుగుచున్నపుడు, అత్యాచారములకు గురియైన వారితో సహా సాక్షులకు ప్రయాణ మరియు పోషణ ఖర్చులను సమకూర్చుట;

(iii) అత్యాచారములకు గురియైన వారికి ఆర్థిక, మరియు సాంఘిక పునరావాసమును కల్పించుట;

(iv) ఈ చట్టపు నిబంధనలను ఉల్లంఘించినందులకు అభియోగములను ప్రారంభించుటకు లేక పర్యవేక్షించుటకు అధికారులను నియమించుట;

(v) అట్టి చర్యలను రూపొందించుటలోను, అమలుపరచుటలోను రాజ్య ప్రభుత్వమునకు తోడ్పడుటకుగాను రాజ్యప్రభుత్వము సబబని తలచునట్టి సముచిత స్థాయిలలో కమిటీలను ఏర్పాటుచేయుట;

(vi) ఈ చట్టపు నిబంధనలను మరింత కట్టుదిట్టముగా అమలుపరచుటకుగాను చర్యలను సూచించు దృష్టితో ఈ చట్టపు నిబంధనలు అమలగుచున్న తీరును నియతకాలికముగా సమీక్షించుటకు ఏర్పాటుచేయుట;

(vii) అనుసూచిత కులములకు, అనుసూచిత జనజాతులకు చెందినవారు ఏ ప్రాంతములలో అత్యాచారములకు గురియగు ఆస్కారముకలదో ఆ ప్రాంతములను గుర్తించుట; వారికి భద్రతను కల్పించుటకై చర్యలను తీసికొనుట;

(3) కేంద్ర ప్రభుత్వము, ఉపపరిచ్ఛేదము (1) క్రింద రాజ్య ప్రభుత్వములు తీసుకొనిన చర్యలను సమన్వయపరచుటకు ఆవశ్యకమగునట్టి చర్యలను తీసుకొనవలెను.

(4) ఈ పరిచ్ఛేదపు నిబంధనలననుసరించి కేంద్ర ప్రభుత్వము మరియు రాజ్య ప్రభుత్వములు తీసుకొనిన చర్యలను గురించిన నివేదికను కేంద్ర ప్రభుత్వము ప్రతి సంవత్సరము పార్లమెంటుయొక్క ప్రతి సదనము సమక్షమున ఉంచవలెను.

సద్భావముతో తీసికొనిన చర్యకు రక్షణ.

22. ఈ చట్టము క్రింద సద్భావముతో దేనిన్నైనను చేసినందుకు లేక చేయుటకు ఉద్దేశించినందుకు కేంద్ర ప్రభుత్వముపైగాని, రాజ్యప్రభుత్వముపైగాని, ప్రభుత్వము యొక్క ఏ అధికారిపై లేక ప్రాధికారిపైగాని, ఎవరేని ఇతర వ్యక్తిపైగాని దావా, అభియోగము లేక ఇతర శాసనబద్ధ చర్య ఏదియువుండదు.

నియమములు చేయు అధికారము.

23. (1) కేంద్ర ప్రభుత్వము ఈ చట్ట ప్రయోజనములను నెరవేర్చుటకు రాజపత్రములో అధిసూచన ద్వారా నియమములను చేయవచ్చును.

(2) ఈ చట్టము క్రింద చేసిన ప్రతి నియమమును దానిని చేసిన పిమ్మట వీలైనంత శీఘ్రముగా, పార్లమెంటు అధివేశనములోనున్న సమయమున, మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనము సమక్షమున వుంచవలెను. ఆ ముప్పది దినములు ఒకే అధివేశనములోగాని వరుసగా వచ్చు రెండు లేక అంతకు ఎక్కువ అధివేశనములలోగాని చేరియుండవచ్చును. పైన చెప్పిన అధివేశనమునకు లేక వరుసగా వచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు పూర్వమే ఆ నియమములో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేక ఆ నియమమును చేయరాదని ఉభయ సదనములు అంగీకరించినచో అటు పిమ్మట ఆ నియమము అట్లు మార్చిన రూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును లేక సందార్భనుసారముగ ప్రభావరహితమ్మైయుండును. అయినప్పటికిని ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని, అంతకు పూర్వము ఆ నియమము క్రింద చేసిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

— ° —